# దేవుడూ.. దీవించు...

పి. ఎస్. నారాయణ

కథ

ఏడు గంటలయ్యింది.
సెల్‌లో అలారం పెట్టుకుని అయిదింటికి లేచినా అన్ని పనులూ అయ్యేటప్పటికి ఇంత సమయం పట్టింది.
ముఖం కడుక్కుంటూనే బ్రూ కలుపుకున్నాడు.
ఇలాంటి వెధవ పనులు చేయటమంటేనే బహు చికాకు అతడికి.రాత్రి మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్‌లో భార్యను గుడివాడ పంపించాడు– మామగారికి ఒంట్లో బాగోలేదు వెంటనే రమ్మంటూ ఫోను వస్తే.

ఆయన రెండేళ్ళబట్టీ రెండు నెల్లకోసారి మంచం మీద నుంచి క్రిందకీ, క్రిందనుంచీ పైకీ మారుతూనే ఉన్నాడు. మొదట ఒకటి రెండు సార్లు తనూ భార్యతో పాటు వెళ్ళాడు. వయస్సు వచ్చింది. బి.పి. సుగర్, హార్ట్, కీళ్ళనొప్పులు, కాళ్ళనొప్పులూ.. అన్నీ ఉన్నాయి..వాటితో నానా బాధా పడుతున్నాడు.. ఆయన్ను చూస్తే జాలేస్తుంటుంది..పాపం!

గడ్డం చేసుకున్నాడు. స్నానం చేశాడు. వంటింట్లో దేవుడి ఫోటోల దగ్గర నిల్చొని కుంకుం పెట్టుకున్నాడు. సాయిబాబా విబూధి పెట్టుకున్నాడు. అందరి దేవుళ్ళను పేరుపేరునా గుర్తు చేసుకుంటూ నమస్కారాలు పెట్టాడు. త్వరత్వరగా గుడ్డలు మార్చుకుని స్కూటరెక్కాడు.

ఆ వీధిలోనే వున్న ఆంజనేయస్వామి గుడికి వెళ్ళాడు. అష్టోత్తరం చేయించి కొబ్బరికాయ కొట్టాడు. వెంకటేశ్వర స్వామి గుడికి వెళ్ళాడు. అక్కడ వున్న అందరి దేవుళ్ళకు కొబ్బరికాయలు కొట్టి ప్రదక్షిణాలు చేస్తూ, నమస్కారాలు పెట్టుకుంటూ, చెంపలు వాయించుకున్నాడు.

ఎల్లమ్మ గుడికి వెళ్ళాడు. అక్కడినుంచి సరాసరి దుర్గ గుడికి వెళ్ళాడు. కొబ్బరికాయ కొట్టాడు. ఆ గుడి పక్కనే వున్న ఆంజనేయస్వామి గుడికి వెళ్ళి లోపలున్న అందరి దేవుళ్ళకూ కొబ్బరికాయలు కొట్టి, పూజలు ముగించేటప్పటికి పది గంటలయింది.

హడావిడిగా హోటల్‌కు వెళ్ళి టిఫిన్ తిని, కాఫీ తాగి స్కూటరెక్కాడు. భార్య వుంటే ఆమే చేసిపెట్టేది టిఫిన్.

ముసలాయనకు అలా వుంటే తను పంపించకుండా ఎలా వుంటాడు.. పాపం!

టైం పది దాటుతుండటంతో ఆఫీసు వైపుకు స్కూటర్‌ను పరుగులు తీయించాడు.

ఆఫీసులో అందరికీ తలా ఒక కొబ్బరి చిప్పా ఇచ్చాడు.

కొలీగ్స్ అడగనే అడిగారు,''ఏమిటీ మళ్ళా మామగారికి బాగోలేదా?'' అంటూ ''నీకెట్లాగయినా మామగారంటే బహుప్రేమ గురూ!'' అన్నారు ముక్త కంఠంతో.

''అవును!'' అన్నాడు ఏడుపు ముఖంతో.

సాయంత్రం సాయిబాబాగుడికి ఆంజనేయస్వామి గుడికీ వెళ్ళాలి.

రేపొద్దున్నే చిలుకూరు వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్ళి పదకొండు ప్రదక్షిణాలు చేసి రావాలి.

ఆయన బాధ తను చూడలేడు..మంచంలోంచి కదలలేడు పాపం!

తనింత కష్టపడి నూటొక్క దేవుళ్ళకూ కొబ్బరికాయలు కొట్టి, వందలు వందలూ ఖర్చుపెట్టి ప్రార్థిస్తున్నాడు. ఫలితముంటుందో లేదో.. కనబడ్డ ప్రతి దేవుణ్ణి కనికరించమనే వేడుకుంటున్నాడు. ఆ ముసలి ప్రాణానికి ఈ కష్టాలు త్వరగా తొలగించు తండ్రీ అంటూ..

పీకల్లోతు అప్పుల్లో తను మునిగివున్నాడు. ఆయనకు ముక్తి కలిగితే ఆ ఆస్తంతా తనకే వస్తుంది– ఆయనకు తన భార్య ఒక్కతే కూతురవ్వటంతో..

క్లబ్బుకెళ్ళి ఆరు నెలలయింది. ఒక్క వెధవా అప్పుగానైనా పైసా రాల్చి చావటంలేదు.

దేవుళ్ళూ...నన్ను త్వరగా దీవించండి!

*

